

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.10 (305.5646)	46,748	46,748
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	2,551.83	2,860.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



రెవెన్యూ లీలలు ఇన్నిన్ని కాదయా!

భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములను కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో పంపిణీ చేసిన భూముల క్రయ, విక్రయాలు జరిగాయని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మృతి చెందిన వ్యక్తి పేరున అధికారులు ఎన్‌వోసీ జారీచేయడం వెలుగుచూసింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- మృతి చెందిన వ్యక్తి పేరుతో ఎన్వోసీ జారీచేసిన వైనం
- ఆలేరు, కొలనుపాక ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ భూముల కొనుగోళ్లపై ఫిర్యాదు
- సమగ్ర విచారణకు ఆదేశించిన కలెక్టర్
- కోర్టు ఉత్తర్వుల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని వచ్చిన దరఖాస్తు

జిల్లాలో ప్రధానంగా ఆలేరు, వలిగొండ మండలాల్లో నిషేధిత భూముల క్రయ, విక్రయాలు జరిగాయని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద పంపిణీ చేసిన భూములను నిరాక్షరాస్యులైన తల్లిదండ్రుల నుంచి నాన్‌జ్యూడీషియల్ బాండ్లు, తెల్లకాగితాలపై సంతకాలు చేసుకుని, తమ సంతకాలు లేకుండానే కొంతమంది కొనుగోలు చేశారని వారి వారసులు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో భూముల క్రయ, విక్రయాలపై ఆరా తీయగా, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టుగా తెలిసింది. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని చేసుకున్న దరఖాస్తులకు ఎన్వోసీల జారీలో గందరగోళం నెలకొంది. ఆలేరు, కొలనుపాకలో కొనుగోలు చేసిన భూములపై ఆరా తీయగా, 2008 లో నే మృతి చెందిన ఓ వ్యక్తి పేరున ఉన్న భూమిని హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆగస్టు 2019లో కలెక్టర్‌కు దరఖాస్తు వచ్చింది. ఆ లేఖ ఆధారంగా పరిశీలించాలని ఆలేరు మండల అప్పటి తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డికి అప్పటి కలెక్టర్ అనితారామచంద్రన్ లేఖ నెంబరు ఈ/2299/2019ను పంపారు. ఆలేరు, కొలనుపాక రెవెన్యూ గ్రామాల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ కింద పంపిణీ చేసిన భూములపై సమగ్ర నివేదిక అందించాలని కోరారు. దీంతో అప్పటి తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి కలెక్టర్‌కు ఆలేరు, కొలనుపాకలోని సర్వే నెంబర్లు 227, 228, 234, 235, 236, 237, 238, 239, 245 మొత్తం 131.16 ఎకరాల భూమిని పంపిణీ చేసినట్టు 2019 అక్టోబరులో కలెక్టర్‌కు నివేదించారు. అయితే 2008లోనే మృతి చెందిన వ్యక్తి, తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఎలా లేఖ రాశాడో అర్థంకాని ప్రశ్న. మరోవైపు మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన భూములను వాస్తవానికి వారి వారసుల పేరున బదిలీ అయ్యాక విక్రయించాలి. అయితే 2008లోనే మృతి చెందగా, అతడి పేరు మీద ఉన్న భూమిని ఎలా విక్రయించారనేది రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో మార్ట్‌గేజ్ విడుదల విషయంలోనూ గందరగోళం నెలకొందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూముల విక్రయాలపై పూర్తి విచారణ చేయాలని దళితులు కోరుతున్నారు.

ఎన్వోసీ జారీ ఎలా?

ఆలేరు, కొలనుపాకకు చెందిన దళితులకు ఎస్సీ కార్పొరేషన్ కింద భూములు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 1997-1998లో స్థానికంగా ఉన్న కొంతమంది వద్ద భూములు కొనుగోలు చేసింది. ఆలేరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 227, 228, 234, 235, 236, 237, 238, 239, 245లో మొత్తం 60మంది ఎస్సీ కుటుంబాలకు 131.16ఎకరాల భూమిని పంపిణీ చేసింది. ఎస్సీ కార్పొరేషన్ కింద తీసుకున్న అన్ని రకాల రుణాలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అన్ని రుణాలు కూడా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మాఫీ అయ్యాయి. ఈ ఉత్తర్వులను ఆసరా చేసుకుని కొంతమంది స్థానిక రాజకీయనేతలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఈ భూములను

- మిగతా 8వ పేజీలో...

నర్సింగ్ కళాశాలకు సమస్యల సుస్తీ

- ఇరుకైన అద్దెభవనం, ఆరుగురికి ఇద్దరే ఫ్యాకల్టీ
- ఒత్తిడికి గురవుతున్న విద్యార్థినులు

వైద్య సేవల్లో వైద్యులతోపాటు నర్సులు పాత్ర కీలకం. దీంతో నర్సింగ్ కళాశాల నిర్వహణ, శిక్షణ సక్రమంగా ఉంటేనే భవిష్యత్ నర్సులు రోగులకు నాణ్యమైన సేవలు అందించగలుగుతారు. అలాగే ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలన్నీ మహిళ కళాశాలలు కాగా, ఈ విద్యా సంవత్సరం నుంచి కో-ఎడ్యుకేషన్‌కు అనుమతి ఇచ్చే అవకాశాలను వైద్య ఆరోగ్యశాఖ పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, జిల్లా కేంద్రం భువనగిరిలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సమస్యలకు నెలవుగా మారింది. అద్దె, ఇరుకు భవనంలో కొనసాగుతుండగా ఫ్యాకల్టీ కొరత కూడా వేధిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



భువనగిరిలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

భువనగిరి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. నర్సింగ్ కళాశాల రెండు బ్లాక్‌లుగా ఉంది. ఒకటి టీచింగ్ బ్లాక్, మరొకటి హాస్టల్ బ్లాక్. నిబంధనల ప్రకారం టీచింగ్ బ్లాక్ 22,200 స్క్వేర్ ఫీట్స్ విస్తీర్ణంలో 15 గదులుగా, మరో 1,000 స్క్వేర్‌ఫీట్స్‌తో మరుగుదొడ్లు ఉండాలి. హాస్టల్ బ్లాక్ 21,000 స్క్వేర్‌ఫీట్స్‌తో తొమ్మిది గదులుగా ఉండాలి. కానీ, నిబంధనలకు విరుద్ధంగా కళాశాల ఇరుకైన అద్దె భవనంలో కొనసాగుతోంది. అలాగే 10మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఫ్యాకల్టీ ఉండాలి. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఏవో, ఇతర సిబ్బంది అదనం. కానీ మొదటి బ్యాచ్ 60 మంది విద్యార్థులతో నడుస్తున్న కళాశాలలో కేవలం ఇద్దరు మాత్రమే టీచింగ్ ఫ్యాకల్టీ, ఒక ప్రిన్సిపాల్ ఉన్నారు. ప్రిన్సిపాల్, ఇద్దరు ఫ్యాకల్టీతో కలిపి ముగ్గురు ఏడాదిగా పాఠ్యాంశాలను బోధించడం, ల్యాబ్‌లలో శిక్షణ ఇవ్వడం చేస్తున్నారు. మరో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వాచ్‌మెన్, అటెండర్ తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. 43 మంది బాలికలు అదే భవనంలోని హాస్టల్‌లో ఉంటూ ఇక్కట్లకు గురవుతున్నారు. నాలుగేళ్ల నర్సింగ్ కోర్స్ కౌన్సిలింగ్ ఇటీవలే ముగియడంతో త్వరలో మరో

- మిగతా 8వ పేజీలో...

సెల్లార్ భవన యజమానులకు నోటీసులు

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలోని వాణిజ్య సముదాయాల్లో అక్రమంగా నిర్మించిన సెల్లార్లపై మునిసిపాలిటీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. కొన్ని భవంతుల్లో అనుమతులతో సెల్లార్లు నిర్మించగా, మెజార్టీ భవనాల్లో అక్రమంగా నిర్మించారు. వాస్తవానికి సెల్లార్లను కేవలం వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలి. కానీ, అందుకు విరుద్ధంగా సెల్లార్లను దుకాణాలకు అద్దెకు ఇవ్వడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు ఉత్పన్నమై రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల సంబంధిత భవన యజమానులతో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సమావేశం నిర్వహించి ఈనెల 31 లోపు సెల్లార్లలోని దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో సెల్లార్ ఉన్న భవన యజమానులకు మునిసిపాలిటీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. పార్కింగ్ అనుమతులతో నిర్మించి దుర్వినియోగం చేస్తున్న సెల్లార్లను గడువులోపు మూసివేయాలని, లేనిపక్షంలో మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ జి.రామలింగం ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మునిసిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది 17 మంది భవన యజమానులకు నోటీసులు అందజేశారు. మిగతా 15 మంది యజమానులకు శనివారం నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిపారు.


సెల్లార్ భవన్ యజమానికి నోటీస్ అందజేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని, దశల వారిగా బిల్లులు వారి ఖాతాలో జమ అవుతుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుడు నాగార్జున్‌గౌడ్ ఇంటిని పరిశీలించి ఇప్పటి వరకు ఎన్ని డబ్బులు వచ్చాయని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మూడు దశల్లో రూ.4లక్షలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయని లబ్ధిదారుడు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యతాప్రమాణాలు పాటించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకుని త్వరగా గృహప్రవేశం చేయాలని సూచించారు.


నందనం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు

ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంతధాన్యం కేంద్రానికి వచ్చింది? వర్షానికి ధాన్యం తడిసిందా? అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యంపై టార్పాలీన్లు కప్పి ఉంచాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వరి నూర్పిడి చేపట్టవద్దన్నారు. ఆయన వెంట ఏపీఎం పాశికంటి మల్లేశం, సీసీ అప్సర్‌బీ, తదితరులు ఉన్నారు.

వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి

(ఆంధ్రజ్యోతి, వలిగొండ): విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని టేకులసోమారం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది ఉత్తీర్ణతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈవిద్యా సంవత్సరంలో కూడా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిల్‌ను బహుమతిగా ఇస్తానని, తల్లిదండ్రులను సన్మానిస్తానని తెలిపారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం




రామన్నపేటలో జరిగిన సిఐటియు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రవాణారంగ డ్రైవర్లను కఠినంగా శిక్షించే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం రామన్నపేటలో నిర్వహించిన రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.పాషా మాట్లాడారు. భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ 106(1)(2) బిల్లు విషయంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా లోక్‌సభ, రాజ్యసభలో మెజార్టీ ఉందని బిల్లును కేంద్ర తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రధానమైన రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం సైతం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా చేసిందని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024 అక్టోబరు 8 నుంచి నేటి వరకు దాన్ని రెన్యూవల్ చేయాలేదన్నారు. వెంటనే బీమా పాలసీని రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మహాసభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, నాయకులు ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, ఎస్‌డీ.ఉమర్, అప్పం సురేందర్, నానచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూములను లాక్కునే ప్రయత్నాన్ని విరమించుకోవాలి

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట దళితుల నిరసన

భువనగిరిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన భూములను లాక్కునే ప్రయత్నాన్ని విరమించుకోవాలని దళితులు, పలు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మోటకొండూరు మండలానికి చెందిన దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మోటకొండూరులో ప్రభుత్వ కార్యాలయాల భవనాల కోసం గతంలో కేటాయించిన, కోర్టు వివాదంలో ఉన్న భూములను లాక్కునేందుకు రెవెన్యూ అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని విరమించుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మైసయ్య, రవీందర్, అనిల్‌కుమార్, భిక్షపతి, హరిబాబు, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

నిరంతర లీకేజీ

- వృథా, కలుషితం అవుతున్న గోదావరి జలాలు
- అండర్‌పాస్ బ్రిడ్జికి ముప్పుగా మారుతున్న లీకేజీలు

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ పైపులైన్ నిర్వహణలో అధికారులు చూపుతున్న అలసత్వంతో విలువైన గోదావరి జలా లు కలుషితం, వృథా అవుతున్నాయి. అలాగే లీకేజీ నీరు అండర్‌పాస్ బ్రిడ్జికి ముప్పుగా మారుతోంది. భువనగిరి పట్టణం టీచర్‌కాలనీ క్రాస్‌రోడ్, బైపాస్ రోడ్ అండర్‌పాస్ బ్రిడ్జి సమీపంలో ఈ పరిస్థితి ఉండగా, లీకేజీ ఏర్పడటం, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది.


అండర్‌పాస్ బ్రిడ్జి కింద చేరిన లీకేజీ నీరు

నిరంతరం లీకేజీ

మిషన్‌భగీరథ పైపులైన్ ఇక్కడ పలు కారణాలతో నిరంతర లీకవుతోంది. ఈ మార్గంలో రెండు పైపులైన్లు ఉండగా, ఒకటి స్థానిక సరఫరాకు, మరొకటి పోచంపల్లి వైపు గోదావరి జలాలు సరఫరా అవుతుంటాయి. అయితే పలు కారణాలతో ఈ చౌరస్తాలో ఒక టి లేదా రెండు కూడా నిరంతరం లీకవుతున్నాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో బురద నీటి గుంతలు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాక పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న జలాలు కూడా కలుషితం అవుతున్నాయి. అలాగే లీకేజీ అయినా గోదావరి జలాల పక్కనే ఉన్న బైపాస్ రోడ్ అండర్‌పాస్ బ్రిడ్జిలోకి ఊట చేరుతోంది. దీంతో అండర్‌పాస్ బ్రిడ్జి గోడలు ఊట నీటితో నిరంతరం తడిగా ఉంటున్నా యి. అండర్‌పాస్ బ్రిడ్జిరోడ్ పైకి బురదనీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఇలాంటి పరిస్థితి ఎదురైన ప్రతీసారి చేస్తున్న మరమ్మతులు తాత్కాలికమే కావడంతో నిధులు వృథా అవుతున్నాయి. అయి తే నిరంతరం లీకేజీకి అసలు కారణాలను గుర్తించి సాంకేతికంగా మరమ్మతులు చేస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రద్ధ చూపాలని, లేని పక్షంలో పైపులైన్, అండర్‌పాస్ బ్రిడ్జికి ముప్పు తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

లీకేజీ నీరు ఊటరూపంలో అండర్‌పాస్ బ్రిడ్జిలోకి చేరడంపై గతంలో ఎన్‌హెచ్‌ఏ అధికారులు మిషన్ భగీరథ అధికారులకు లేఖ కూడా రాశారు. ఇప్పటికైనా లేఖలు వచ్చినప్పుడే, లీకేజీ ఏర్పడినప్పుడే హడావుడిగా తాత్కాలిక మరమ్మతులకు వెళ్లకుండా శాశ్వత పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందిస్తూ త్వర లో శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొంటున్నారు.


పాల బిల్లులు చెల్లించాలని పాడిరైతుల నిరసన


పాల క్యాన్లతో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

గుండాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదర్‌డెయిరీ బకాయి ఉన్న పాల బిల్లులు వెంటనే చెల్లించాలని శుక్రవారం మండలంలోని నూనేగూడెం గ్రామానికి చెందిన పాడిరైతులు పాల సంఘం ఎదుట పాల క్యాన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు మాట్లాడుతూ నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మదర్‌డెయిరీలో సుమారు 300 మంది పాడి రైతులకు గత నాలుగు నెలల పాల బిల్లులు రావల్సి ఉందన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గన్న మాధవరెడ్డి, అండెం విష్ణువర్ధన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, మల్లేశ్, రాము, దయాకర్ రెడ్డి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భువనగిరిలో బాలుర
అండర్-19 రాష్ట్రస్థాయి
వాలీబాల్ పోటీలు
- పాల్గొననున్న 10 ఉమ్మడి జిల్లాల జట్లు
- రానున్న సుమారు 300 మంది క్రీడాకారులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

7



యాదగిరీశుడికి వైభవంగా
సువర్ణ పుష్పార్చన
- అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం

7

కార్తీక మాసం అన్నింటా ప్రత్యేకం



ఓ దుకాణంలో నిల్వ చేసిన పూజాసామాగ్రి

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

ప్రజలందరిలో భక్తిభావం పెరగడంతో ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. రవాణా సౌకర్యాలు మెరుగవడం, ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో యాత్రాస్థలాలు, క్షేత్రాల సందర్శనకు వచ్చే భక్తుల సంఖ్యకు పెరిగింది. దీంతో ఆలయ సందర్శనకు ముడి పడి ఉన్న వ్యాపారాలకు కూడా క్రమంగా గిరాకీ పెరిగింది. ఇందులో భాగంగానే కార్తీక మాసంలో ముఖ్యంగా పూజా స్టోర్‌లు సందడిగా ఉంటున్నాయి. వినాయక చవితి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాల సందడి నెలకొంటుంది. ఆ తర్వాత దేవీశరన్నవరాత్రోత్సవాలు, ఆపై దీపావళి నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండటంతో పూజాసామాగ్రి వాడకం పెరుగనుంది. దీంతో పూజాస్టోర్ నిర్వాహకులు కూడా కొన్ని రోజుల ముందు నుంచే సామాగ్రి నిల్వలను పెంచుకుంటారు. ముఖ్యంగా పసుపు, కుంకుమ, గంధం, హారతి కర్పూరాలు, పత్తితో చేసిన వొత్తులు, కొవ్వొత్తులు, నువ్వుల నూనె బాటిళ్లు, నెయ్యి ప్యాకెట్లు, ఊది బత్తీలు, ఆయా రకాల వత్తుల ప్యాకెట్లను నిల్వ చేసుకుంటారు. ప్రతీ నెలా రూ.2లక్షల వ్యాపారం చేస్తే ఒక్క కార్తీక మాసంలోనే సుమారు రూ.5లక్షల వరకు వ్యాపారం ఉంటుంది. నువ్వుల నూనె బాటిళ్లు సిద్ధిపేట జిల్లా నుంచి, పత్తి, ధారపు వత్తులు ఏపీలోని పిఠాపురం నుంచి, పసుపును నిజామాబాద్ నుంచి, కుంకుమ హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇందుకోసం ముందుగానే ఆర్డర్ పెట్టుకుంటామని తెలిపారు.

కార్తీకం మాసం పూజా సామాగ్రికి ప్రత్యేకం



పూజాసామాగ్రి వ్యాపారస్థులకు కార్తీక మాసమే వ్యాపార మాసం. ఈ మాసంలో పూజాసామాగ్రి వాడకం ఎక్కువగా ఉంటుంది. వినాయక, దసరా నవరాత్రి ఉత్సవాలు మొదలుకుని కార్తీక మాసాంతం తదుపరి అయ్యప్ప దీక్షల ముగింపు వరకు వ్యాపారం ఉంటుంది. ఏడాదిలో ఆరు నెలల పాటు ఉండే వ్యాపారం ఒక ఎత్తయితే కార్తీక మాసంలో జరిగే వ్యాపారం ఎక్కువగా ఉంటుంది.

- బండారు రమేష్, పూజా సామాగ్రి వ్యాపారి, నార్కట్‌పల్లి.

కార్తీకమాసం అంటేనే ఆధ్యాత్మిక మాసం. లయకారకుడైన పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో ప్రతీ భక్తుడు వీలైనంత వరకు ప్రతీ రోజూ ఉదయాస్తమాన సమయాల్లో ఓ దీపాన్ని వెలిగించాలని తాపత్రయ పడతాడు. నిత్యం ప్రతీ దేవాలయంలో ప్రతీ ఇంటి ముంగిట చీకట్లను తరిమేసేలా దీపాల వెలుగులు విరజిమ్ముతాయి. దీంతో ఈ మాసంలో కొబ్బరికాయలతో పాటు దీపాలు వెలిగించేందుకు అవసరమైన నువ్వుల నూనె, ప్రమిదలు, వత్తులు, కొవ్వొత్తులు, నెయ్యికి డిమాండ్ ఉంటుంది. అందుకే ఈ మాసంలో వీటి విక్రయాలు ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మాసం మొత్తం శాకాహార భోజనం చేస్తుంటారు. దీంతో కూరగాయల ధరలు పెరగడంతో పాటు మాంసం ధరలు తగ్గుముఖం పడతాయి.



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

కార్తీకమాసంలో చాలామంది తమ ఇష్టదైవాలను ప్రత్యేకంగా కొలుస్తుంటారు. అయ్యప్ప, శివ,ఆంజనేయ, భవానీమాలలు ధరిస్తుంటారు. మాలధారులతో పాటు ఇంట్లో వారు సైతం అదే నిష్ఠతో ఉంటారు. కూరగాయల భోజనానికే అధిక ప్రాధాన్యమిస్తారు. చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో శాకాహారమాసంగా పిలుస్తుంటారు. ఈ మాసంలో మాంసం కొనుగోలు అంతగా లేక ధరలు తగ్గనుండగా, కొనుగోళ్ల పెరిగి కూరగాయల ధరలు పెరుగుతాయి. ప్రతీ ఒక్క కూరగాయ గత నెల కిలో రూ.50లోపు ఉండగా ప్రస్తుతం రూ.60 నుంచి రూ.80 వరకు ఉన్నాయి. దోసకాయ కిలో రూ.60, కాకరకాయ రూ.80, బెండకాయ కిలో రూ.50, దొండకాయ కిలో రూ.60, గోకరకాయ కిలో రూ.80, పచ్చిమిర్చి కిలో రూ.80, టమాట కిలో. రూ.30, ఆలుగడ్డ రూ.50, వంకాయ రూ.40, బీరకాయ రూ.80 పలుకుతోంది.

ఆరోగ్యమే ప్రధానంగా..

కార్తీకమాసంలో కూరగాయల భోజనానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఉపవాసాలు ఉండటంతో అధిక పోషకాలు ఉంటాయని కూరగాయల భోజనాన్ని భుజిస్తుంటారు. వేగంగా జీర్ణక్రియ జరగడంతో పాటు మలబద్ధకం సమస్యలు దరిచేరవు. అంతేకాకుండా కూరగాయల్లో ఖనిజాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్‌లు, ఫైబర్ అధికంగా లభిస్తుంది. ప్రతి ఒక్క కుటుంబంలో బీపీ, షుగర్‌తో పాటు పలు దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారు ఉండడంతో ప్రస్తుతం కూరగాయలను స్వీకరిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో 3,71,400 కుటుంబాలు ఉండగా వీరిలో మూడువంతుల మంది కూరగాయలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వారంలో రెండు రోజులు ఆకుకూరలు తీసుకుంటున్నా



గతంలో మాంసానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవాడిని. ప్రస్తుతం వారంలో నాలుగు రోజులు కూరగాయలు, రెండు రోజులు ఆకుకూరలు తింటున్నా. ఆరోగ్యం బాగుంటుంది. ఎలాంటి ఆరోగ్య సమస్యకైనా కొంత కూరగాయలు ఉపశమనం కలిగిస్తాయి.

- భానుచందర్, సూర్యాపేట వాసి

కార్తీకమాసంలో మాంసాన్ని తీసుకోం



గత ఏడేళ్లుగా కార్తీకమాసంలో మాంసాన్ని తినడంలేదు. మా కుటుంబ సభ్యులు అంతా ఈ నెలరోజుల పాటు కూరగాయల భోజనం చేస్తారు. భక్తితో పాటు ఆరోగ్యం బాగుంటుంది. కూరగాయల ధరలు కాస్త అధికంగా ఉన్నాయి.

- పద్మ, పట్టణవాసి

బురద దారిలో వెళ్లేదెలా



గుంతలమయమైన రహదారిలో అలుగునూరు గ్రామానికి వెళ్తున్న 108 వాహనం

నూతనకల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి క్రాస్‌రోడ్డు నుంచి అలుగునూరు గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. గుంతలమయమైన దారి చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారుతోంది. ఈ దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. శుక్రవారం అలుగునూరు నుంచి క్షతగాత్రులను ఆసుపత్రులకు చేర్చేందుకు వెళ్లిన 108 వాహనానికి తిప్పలు తప్పలేదు. గుంతలమయమైన రహదారిలో జారుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్థులు కోరారు.

ట్రాక్టర్ ఇసుక రూ.10 వేలు

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జోరుగా ఇసుక దందా కొనసాగుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.10 వేల వరకు పలుకుతోంది. మండలంలోని మక్తా కొత్తగూడెం, ఏపూర్, రామన్నగూడెం ఏటి నుంచి రాత్రీపగలు తేడా లేకుండా బాహాటంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా ఇసుక దందా ఆగడం లేదు. ఇటీవల భారీ వర్షాలు రావడంతో ఏటిలో వేగంగా నీటిప్రవాహం ఉన్నా నీళ్లలో దిగి ఇసుకను బయటకు తీస్తున్నారు. సమీపంలో కుప్పలుగా పోసి ట్రాక్టర్లలో నింపి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కొక్క ఇంటికీ 20 ట్రిప్పులు అవసరం ఉండగా ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు సగం డబ్బులు ఇసుకే ఖర్చు అవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మక్తాకొత్తగూడెంలో కూడలి గ్రామానికి చెందిన ట్రాక్టర్లు ఏటి నుంచి ఇసుక తీస్తుండగా గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నప్పటికీ ఇసుక దందా ఆగడం లేదు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అనుమతులు ఇవ్వాలంటూ మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి, బహిరంగంగా ఇసుకను బయటకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను విక్రయించడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది ఇసుక ట్రాక్టర్ల వద్ద చేతివాటానికి అలవాటు పడడం పరిపాటిగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.





ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న మహిళలు, మక్తా కొత్తగూడెం ఏటిలో నీటి నుంచి ఇసుక తీస్తున్న మహిళలు

తరలింపును కొంతమేర అరికట్టాం

మండలంలో ఏటి వెంట ఉన్న గ్రామాల్లో గతంలో ఇసుక అక్రమ రవాణా జరిగేది. ఇటీవలి ముక్కుడుదేవులపల్లి, ఏపూరు, రామన్నగూడెం గ్రామాల్లో ఇసుక తరలింపును కొంతమేర అరికట్టాం. మక్తాకొత్తగూడెంలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందిని పంపించాం. రాత్రి వేళ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల హత్య సంఘటనతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగింది. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

శ్రీకాంత్‌గౌడ్, ఎస్ఐ, ఆత్మకూరు(ఎస్)

పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలి



గడ్డిపల్లి కేవీకేలో రైతులకు సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ బిందుమాధురి, నరేష్

గరిడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధిపై రైతులు దృష్టి సారించాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త బిందు మాధురి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాయలం, వరంగల్ జిల్లా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత-పరిష్కారాలు' అనే అంశంపై రైతులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పాడిపశువులపై యాంటీ బయోటిక్స్ అతి వినియోగం చేయవద్దన్నారు. వాటి వినియోగంతో పశువులతో పాటు మానవుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని వివరించారు. పశువుల షెడ్డును శుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌చార్జి డీ నరేష్, డాక్టర్ అరుణజ్యోతి, సాయికిరణ్, డాక్టర్ అంబిక, డాక్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకళావేదిక కార్యనిర్వాహక కార్యదర్శిగా గజం ఉమాసత్య



గజం ఉమాసత్య

రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన కవయిత్రి గజం ఉమాసత్యను నియమిస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమాసత్య అనేక కవితలు, రచనలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించడంతో పాటు మనోచైతన్యం అనే పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ శ్రీశ్రీకళావేదిక తెలుగు భాష సంస్కృతీ, వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల అభివృద్ధిపై కృషి చేస్తోందన్నారు. 36 ప్రపంచ రికార్డులను ఈ సంస్థ సాధించిందన్నారు. నిరంతరం సాహితీ కార్యక్రమాలతో ప్రపంచంలోని అతిపెద్ద సాహితీ సంస్థగా ఎదిగిందన్నారు. ఇలాంటి సాహితీ సంస్థకు రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని శుక్రవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టు నాయమూర్తి పీవీ రమణ ఎదుట హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధించారని, మిగిలిన నలుగురికి కలిపి రూ.4500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

15 ఏళ్లుగా విధులు.. రూ.13 వేలే వేతనం

- భారంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కుటుంబ పోషణ



ప్రసాద కౌంటర్లలో విధుల్లో నిమగ్నమైన బ్యాంకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

యాదగిరిగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పలు బ్యాంకుల తరఫున విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన 17 విభాగాలతో పాటు సెంట్రల్ బ్యాంకు ఇండియా(సీబీఐ), యూనియన్ బ్యాంకు ఇండియా(యూబీఐ), తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీజీబీ), స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) బ్యాంకులతో కూడా సేవలు అందిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నాలుగు విభాగాల్లో 27 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సీబీఐ బ్యాంకు ప్రసాదాల విభాగంలో 13 మంది, సువర్ణపుష్పార్చన విభాగం ముగ్గురు, యూబీఐ, టీజీజీబీలకు చెందిన 8మంది సిబ్బంది ప్రధాన బుకింగ్, ఎస్బీఐ తరఫున అద్దె గదుల విభాగంలో ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి చాలీచాలని వేతనమే ప్రధాన సమస్యగా మారింది. 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా సిబ్బందికి మాత్రం రూ.13వేలకు మించలేదు. కొన్ని బ్యాంకులు రూ.7వేలే వేతనం ఇస్తున్నాయి. వీటితో సిబ్బంది కుటుంబపోషణకు చేయలేక ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలతో పోటీ పడలేక ఆర్థికంగా చితికిపోతున్నారు. వేతనం పెంచాలని బ్యాంకు మేనేజర్లను సంప్రదిస్తే పైనుంచి ఆమోదం రాలేదని చెబుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ప్రమాదం అంచున ఆటో ప్రయాణం

- పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వైనం
- నామమాత్రంగా అధికారుల చర్యలు



ఆటో వెనకాల కూర్చున్న కూలీలు



పరిమితికి మించి బడిపిల్లలతో వెళ్తున్న ఆటో

నిడమనూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా సరే తొందరగా గమ్యం చేరాలనే ఆరాటం ప్రయాణికులది. కాస్త ఎక్కువ మందిని తరలిస్తే నాలుగు డబ్బులు సంపాదించాలనే బతుకు పోరాటం ఆటోవాలాలది. దీంతో నలుగురు ఎక్కాల్సిన ఆటోలో 25 మందిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగితే ప్రాణాలు నిలుపుకోవడం కష్టసాధ్యమవుతోంది. ప్రస్తుతం పత్తి ఏరే సీజన్ కావడంతో కూలీలు ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్లి పత్తి ఏరేందుకు ఆటోలో వెళ్తున్నారు. అయితే కూలీలు పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. కొందరు మహిళలు సైతం ఏమాత్రం భయం లేకుండా ఆటోపైన ఎక్కి కూర్చుంటున్నారు. ఆటో ప్రయాణం ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ మందితో ప్రయాణం చేస్తున్న ఆటోలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తుండటంతో ఆటో నిర్వాహకుల తీరు మారడం లేదు. ఇటీవల మండలంలోని ముప్పారం గ్రామంలో 20 మంది పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలా తరచుగా ఏదో ఒకచోట ఆటో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమంది పిల్లలు సైతం లైసెన్స్ లేకున్నా ఆటోలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ముఖ్యంగా కూలీలు, బడి పిల్లలతో వెళ్లే ఆటోలు కిక్కిరిసిపోతున్నాయి. నిబంధనల ప్రకారం పరిమితమైన వేగంతో, పరిమిత ప్రయాణికులతో ఆటోలు నడిపేలా అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోలు సీజ్ చేస్తున్నాం

పరిమితికి మించి ప్రయాణికులతో, అతివేగంగా తిరుగుతున్న ఆటోలను గుర్తించి సీజ్ చేస్తున్నాం. ఆటోవాలాలకు, ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నాం.

ఉప్పు సురేష్, నిడమనూరు ఎస్ఐ.

ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టివేత

కనగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. జీఎడవల్లి గ్రామ శివారులో బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ గుండబోయిన మేఘనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

- రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మూసీ వాగు మూలగుట్ట సమీపంలో ఇసుక డంప్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలన్నారు.

మురిపించిన మంచు తెరలు



బ్రహ్మంగారిగుట్టపై ముసురుతో కమ్ముకున్న మేఘాలు



ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురిసిన వర్షానికి నల్లగొండ జిల్లా కేంద్రం తడిసిముద్దయ్యింది. లతీఫ్‌సాహెబ్‌గుట్టతో పాటు మునుగోడు రహదారిలోని కాపురాలగుట్ట, బ్రహ్మంగారి గుట్టలు, పరిసరాలను మంచు తెరలు కమ్మేశాయి. హిమాయలయాలను తలపించిన మంచు తెరలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పొరలు పొరలుగా కదులుతూ ఆహ్లాదాన్ని పంచాయి. మునుగోడు రహదారిలో వెళ్లే ప్రయాణికులు అటుగా చూస్తూ ఉండిపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీడ్రైవర్ ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ లారీడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అజయ్‌భార్గవ్ తెలిపిన వివరాలప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పెడకంటి వెంకటయ్య(60) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మార్కెట్ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటయ్య ఆర్థిక, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆయయన కుమారుడు అయ్యప్ప ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



రామలింగేశ్వరరావు

నాగార్జునసాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. స్థానిక పైలాన్ కాలనీకి చెందిన ఆత్మకూరి రామలింగేశ్వరరావు గురువారం ఉదయం 9 గంటలకు శివాలయానికి వెళ్లొస్తానని భార్య లక్ష్మికి చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో శివాలయం వద్దకు వెళ్లగా అక్కడ రామలింగేశ్వరరావు ద్విచక్రవాహనం, చెప్పులు కనబడ్డాయి. దీంతో భార్య లక్ష్మి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సదరు వ్యక్తి కనిపిస్తే సెల్ నెంబరు 8712670197కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పశువుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఎస్ఐ అజయ్‌భార్గవ్ తెలిపారు. కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్ బహదూర్‌పేటకు మినీ డీసీఎం వాహనంలో పశువులను అక్రమంగా తరలిస్తుండగా లక్కారం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్ జవ్వాజి రాము, యజమాని మహ్మద్ సమీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్యాలగూడలో జాతీయ స్థాయి నాటక పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళాకేంద్ర పట్టణ ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి తెలిపారు. నందిని ఆర్ట్స్ - 2025 పేరుతో పద్య, శాస్త్రీయ, జానపద విభాగాల్లో 2026 మార్చి నెలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు నవంబరు 1వ తేదీ నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తులను 2026 జనవరిలో పరిశీలించి తుది పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులను పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, రామావతారం, ఉపేందర్, వీరప్రతాప్, ఎల్లయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు బస్సు సౌకర్యం

● *దేవరకొండ డిపో ఇన్‌చార్జి డీఎం సైదులు*

దేవరకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ డిపో నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్ పడాల సైదులు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రామలింగేశ్వరస్వామి దేవాలయం, భీమవరం సోమేశ్వరస్వామి దేవాలయం, పాలకొల్లు క్షీర లింగేశ్వర స్వామి దేవాలయం, ద్రాక్షారామం, భీమేశ్వరస్వామి దేవాలయం, సమర్ల కోట లింగేశ్వరస్వామి దేవాలయాలను ఒకే రోజు దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పెద్దలకు రూ.2200 టిక్కెట్, పిల్లలకు రూ.1400 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో ప్రతీ ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కూడా ప్రత్యేకంగా భక్తుల కోసం బస్సులు నడపనున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

పెన్నా మధుసూదన్‌కు విద్వన్మణి పురస్కారం



చిన్నజీయర్‌స్వామి నుంచి పురస్కారం అందుకుంటున్న మధుసూదన్

నార్కట్‌పల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ సంస్కృత భాషా పండితులు, డాక్టర్ పెన్నా మధుసూదన్‌కు విద్వన్మణి పురస్కారం లభించింది. హైదరాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో గల చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలో గురువారం రాత్రి జరిగిన ఓ ఆధ్యాత్మిక సదస్సులో ఈ పురస్కారాన్ని పెన్నా మధుసూదన్‌కు చిన్నజీయర్ అందజేశారు. జీయర్‌స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్కృతభాషకు విశేషంగా సేవలందిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఇద్దరికి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ అంజనీ మిశ్రా, సముద్రాల రంగ రామానుజచార్యులు, మైహోం రామేశ్వర్‌రావు తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఎస్‌ఆర్‌టీఆర్‌ఐ శిక్షణ

కార్యక్రమాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్‌ఆర్‌టీఆర్‌ఐ)లో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణలతో పాటు ఉద్యోగం కల్పించేందుకు నిర్వహిస్తున్న పలు శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 నెలల కాలపరిమితి కలిగిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) శిక్షణ కార్యక్రమానికి ఇంటర్ పాస్ అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులతో పాటు అర్హతల సర్టిఫికెట్ల జిరాక్సులు, 2 పాస్ ఫొటోలు, ఆధార్ కార్డుతో సంస్థలో నవంబరు 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి భువనగిరిలో బాలుర

అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



వర్షంతో బురదమయంగా మారిన మైదానం

భువనగిరిటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 69వ బాలుర అండర్-19 ఇంటర్ కళాశాలల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నేటి నుంచి రెండు రోజుల పాటు భువనగిరిలో జరగనున్నాయి. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొననున్నాయి. ఇందుకోసం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మంది క్రీడాకారులు, అధికారులు రానున్నారు. అలాగే ఈ టోర్నీలోనే రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయనున్నారు. అయితే అకాల వర్షం నిర్వాహకులను, క్రీడాకారులను భయపెడుతుంది. క్రీడాభిమానులు పోటీలను విజయవంతం చేయాలని టోర్నీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రసాద్ కోరారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు.

ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.13,76,469 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కార్తీకమాసంలో కొండకింద వ్రత మండపాల్లో 185 జంటలు వ్రతాలు నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు.

తుఫానుకు వరిచేలు విలవిల

వరుస వర్షాలనుంచి తేరుకోకముందే వరిచేలపై శుక్రవారం మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో వరి, పత్తిచేలు కోలుకునే పరిస్థితి కనిపించడంలేదు. ధాన్యం ఆరబెడదామంటే వర్షం ఎడతెరిపి ఇవ్వడం లేదు. ధాన్యం రాశిలోనే నల్లబారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● *పండుబారుతున్న పత్తిచేలు*

● *ధాన్యం ఆరక రైతుల తండ్లాట*



నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంలో అకాల వర్షంతో నేలవాలినవరి

తిరుమలగిరి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 4గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షానికి చేతికొచ్చిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. చాలాచోట్ల పత్తి ఏరే దశలో ఉన్న చేలలో పత్తి అంతా తడిసి ముద్దయింది. కోతకొచ్చిన వరిచేన్లు నేలకొరిగాయి. ఈ వర్షంతో చేతికొచ్చిన పంటలన్నీ నాశనమయ్యాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు స్వయంగా ధాన్యం తడవకుండా వడ్లరాశులపై కవర్లు కప్పుకున్నారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నేరేడుచర్ల: మండలంలో ముందుగా నాట్లు వేసిన రైతుల పరిస్థితి



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

దారుణంగా ఉంది. రెండు నెలలుగా వర్షాలు విడిచి పెట్టక పోవడం ప్రస్తుతం తుఫాను రావడంతో ఏపుగా పెరిగిన వరి పంట నేలపడిపోయింది. గాలి కొద్దిగానే ఉండడంతో పంట నష్టం తీవ్రత తక్కువగా ఉంది. ఇటీవల వరి పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకడంతో పురుగు మందుల పిచికారి ఎక్కువగా చేశారు. యూరియా కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వరి ఏపుగానే పెరిగి, వర్షాలకు నేలవాలింది. నర్సయ్యగూడెంలో ఒంటెద్దు ప్రభాకర్‌రెడ్డికి చెందిన 11 ఎకరాల పొలంలో వరిపంట నేలకొరిగింది. మండలం పరిధిలోని పలు గ్రామాలలో కూడా వరిపంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా రెండు రోజులపాటు వర్షాలు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో వరి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.

కోదాడటౌన్/కోదాడ రూరల్: కోదాడ పట్టణంలో వర్షానికి పలు వీధులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. హుజూర్‌నగర్ రోడ్డు సూర్యల్యాబ్ పక్కన గల వీధిలో వరద నీరు బారీగా చేరడంతో ఆ వీధుల గుండా వెళ్లే స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.20 వేలకు పైగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏవో కార్యాలయంలో వ్యవసాయాధికారి రజినీకి వినతిపత్రం అందజేశారు. రైతులు మాతంగి ప్రసాద్, ఏసుపాదం పాల్గొన్నారు.

అర్వపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్లు లేకపోవడంతో నీటిలో ధాన్యం కొట్టుకుపోతుంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లి కేంద్రాలల్లో సన్నధాన్యం కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. అర్వపల్లి కేంద్రంలో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. త్వరగా కాంటాలు వేయాలని రైతులు కోరుతున్నారు.

తుంగతుర్తి : వర్షంతో పాటు గాలి రావడంతో వరి చాలా ప్రాంతాల్లో వరి నేల వాలింది. దీంతో వరి కోయడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా రాదేమో అని ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు ఒకసారి ఎండ బెట్టడం మరోసారి వర్షం పడడం దీంతో రైతులు బాధ వర్ణనాతీతం. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వెంటనే కాంటాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మోత్కూరు: తడిసిన ధాన్యం

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి ఆ గ్రామం నుంచి ముశిపాట్ల, రాయిబావి గ్రామాలకు, ఇతర కాలనీలకు వెళ్లే వీధులు జలమయమయ్యాయి. రోడ్ల వెంట ద్విచక్ర హనాలపై ముశిపట్ల, రాయిబావి గ్రామాలకు వేళ్లే వారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సంబంధిత ఉన్నతాధికారులు కాంట్రాకర్‌పై చర్య తీసుకుని దారిలో నిలిచే నీరు డ్రైనేజీలోకి వేళ్లేలా ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు, పలు కొనుగోలు కేంద్రాలల్లో పోసిన ధాన్యం రాశులు తడిశాయి. వరంతో వరి కోతలకు, పత్తి తీయడానికి అంతరాయం ఏర్పడింది.

ధాన్యం తడవకుండా జాగ్రత్తపడాలి



వర్ధమానుకోట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హరికిషోర్ శర్మ

నాగారం : తుఫాన్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని తడవకూండా టార్పాలిన్స్‌తో కాపాడుకోవాలని తహసీల్దార్ హరికిషోర్ శర్మ రైతులకు సూచించారు. శుక్రవారం వర్ధమానుకోట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తఫాన్ కారణంగా రెండు రోజలు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యంపై పట్టాలతో కప్పి ఉంచాలని కోరారు. లోతట్టులో నీరు నిల్వ ఉండకూండా కాల్వలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. త్వరలోనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకన్న, ఆర్‌ఐ బాబు, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నల్లబారిన తెల్లబంగారం



చేనుపై నల్లబారుతున్న పత్తి

మేళ్లచెర్వు: అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీతకు సిద్ధంగా ఉన్న పత్తి తడిసి కాయలు పగలకుండానే కొన్ని చెట్టు పైన కుళ్లిపోగా కొంత తడిసి గింజలు మొలకలు రాగా...మిగిలిన పత్తి రంగు మారి నల్లబారింది. పత్తి విత్తిన నాటి నుంచి వర్షాలు అనావృష్టితో పాటుగా తెగుళ్ల బారిన పడి పూత, కాత రాలిపోయింది. ఉన్న కాస్త.. పత్తి వర్షాలకు తడిసి వర్షార్పణం అయిపోయింది.

ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు

● *డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి*



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడురూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కచలాపురం, ఊకొండి గ్రామాల్లో మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అకాల వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చే ధాన్యం తేమశాతం 17శాతం ఉండే విధంగా తాలు, మట్టి పెళ్లలు లేకుండా శుభ్రంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర గ్రేడ్ ఏ రూ.2389 సాధారణ రకం రూ.2369లు సన్న వరి ధాన్యానికి రూ.500బోనస్ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు నిబంధనలను పాటించి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, హైమద్, అగ్రికల్చర్ ఏవో పద్మజ, సంఘం డైరెక్టర్లు ఉప్పునూతల రమేష్, మార్తా మోహన్ రెడ్డి, మేకల మల్లయ్య, సింగం వెంకన్న, జిట్టగోని యాదయ్య, ఏఈవో నిఖిల్, సంఘం కార్యదర్శి సుఖేందర్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం, స్వామినాథ్, లింగస్వామి, చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు బీమనపల్లి సైదులు, జాల వెంకటేశ్వర్లు గురజా రామచంద్రం, కొండకింది రాంరెడ్డి, మేడి యాదయ్య, యాదగిరి, దేవలోకం, స్వామి, బీమగోని ముత్యాలు, నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో జాబ్‌మేళాకు భారీ ఏర్పాట్లు



జాబ్‌మేళా కోసం ఏర్పాటు చేస్తున్న వాటర్ ప్రూఫ్ టెంట్లు

● *ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఉత్తమ్, కలెక్టర్, ఎస్పీ*

● *జాబ్‌మేళాకు వచ్చే వారికి భోజన వసతి ఏర్పాట్లు*

● *40 వేల మంది నిరుద్యోగులు వచ్చే అవకాశం*

హుజూర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మూడు రోజుల పాటు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆయనతో పాటు కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎస్పీ నర్సింహ వారం రోజులుగా ఏర్పాట్లు చేయించారు. జిల్లా అధికార యంత్రాంగం వారం రోజులుగా హుజూర్‌నగర్‌లో తిష్టవేసి మెగా జాబ్ మేళాకు ఏర్పాట్లు చేశారు. జాబ్‌మేళాకు 40 వేల మంది పైచిలుకు నిరుద్యోగులు హాజరయ్యే అవకాశం ఉంది. యువతీ, యువకులకు భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. సింగరేణి కాలరీస్, తెలంగాణ పరిశ్రమలు, డీట్ శాఖల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో మొట్టమొదటిసారిగా ఉమ్మడి జిల్లా స్థాయిలో 5వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్రంలోని 275 కంపెనీలను ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం నాటికే 36వేల మందికి పైగా యువతీ, యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. శని, ఆదివారాలలో జాబ్‌మేళాకు వచ్చే యువకులు 10వేల మందికి పైగా జాబ్‌మేళా ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. సోషల్, డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వ యంత్రాంగం జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం చేపట్టింది. ఉమ్మడి జిల్లాలోని సిమెంట్, ఫార్మా కంపెనీలు కూడా జాబ్‌మేళాకు రానున్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని పాత విజ్ఞాన్ స్కూల్ ఆవరణ, స్వర్ణవేదిక ఆవరణలలో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం, కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే జాబ్‌మేళా నిర్వహించాలని మొదట నిర్ణయించగా యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడంతో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కంపెనీల ప్రతినిధులకు తోడుగా మునిసిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖల ఉద్యోగులను సహాయకులుగా నియమించారు. సుమారు 500 మంది పోలీసులతో ఎస్పీ నర్సింహ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చే నిరుద్యోగులకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రాంగణాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అడ్డగూడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాన్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతారాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి భూక్యా ఉమా ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను అదుకోవాలి

మోత్కూరు: మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పత్తి, వరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రని సీపీఎం మండల కార్యదర్శి గుండ్రు వెంకటనర్సు కోరారు. శుక్రవారం అ యన విలేకరుతో మాట్లాడుతూ భారీ వర్షాలకు పత్తి పంటలు దెబ్బతిని రైతుల చేతికి పెట్టుబడి సైతం వచ్చేలా లేదన్నారు. పలు చోట్ల కోతకు వచ్చిన వరి నేలకు వరిగి, కొనుగోలు కేంద్రాలల్లో పోసిన ధన్యాం రాశులు తడిశాయన్నారు.

పీహెచ్‌సీని కొత్త భవనంలోకి మార్చరూ..

- అరకొర వసతుల మధ్య ఆస్పత్రి నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న రోగులు, సిబ్బంది

బీబీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేద ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. భవనం పూర్తయి ఏడాది గడుస్తున్న ప్రారంభానికి నోచుకోకపోవడంతో పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది.



ప్రారంభానికి నోచుకోని నూతన పీహెచ్‌సీ భవనం

ఇరుకు భవనంలో అరకొర సేవలు ..

పీహెచ్‌సీ భవనం నిర్మాణ పనుల కారణంగా 2023లో పాతభవనం కూల్చివేయడంతో ఆస్పత్రిని సమీపంలోని మహిళా సంఘం భవనంలోకి మార్చారు. అక్కడి భవన సముదాయం వైద్య సేవలకు అనుకూలంగా లేదు. అరకొర సౌకర్యాలు, ఇరుకు గదుల కారణంగా పూర్తి స్థాయి సేవలు అందడం లేదు. కేవలం ఓపీ సేవలకు పరిమితం చేశారు. అత్యవసర సేవలు, గర్భిణులను ప్రసూతి కోసం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి. అంతే కాకుండా ఆస్పత్రికి వచ్చే రోగులు సిబ్బంది కూర్చోవడానికి కూడా భవనం అనుకూలంగా లేదు. పైగా 24 గంటల సేవల ఆస్పత్రి కావడంతో రాత్రి పూట విధుల్లో ఉండే సిబ్బందికి భద్రతాపరంగా ఇబ్బందే ఉంది. నూతన భవనం పూర్తయినప్పటికీ ఏడాది గడుస్తున్నా వినియోగంలో లేక నిరుపయోగంగా మారింది.

పీహెచ్‌సీని ప్రారంభించి 40ఏళ్లు ..

మండల వ్యవస్థ ఏర్పాటు అయ్యాక మండల కేంద్రమైన బీబీనగర్‌లో గ్రామీణ నిరుపేద మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం అప్పటి ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితం 1985లో ప్రైవేటు భవనంలో పీహెచ్‌సీని ప్రారంభించింది. అయితే పక్కా భవనం లేని కారణంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి నార్నే రంగారావు ప్రస్తుతం కూల్చివేసిన పాత భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అయితే ప్రణాళికాబద్ధంగా భవన నిర్మాణం లేకపోవడంతో కాలక్రమేణా రోగులు, సిబ్బంది పెరుగుతుండడంతో వైద్య సేవలకు ఆటంకాలు మొదలయ్యాయి. భవన సముదాయం ఇరుకుగా ఉండడంతో పాటు ఎదురుగా రైల్వే ప్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం రోడ్డు విస్తరణతో ఆసుపత్రి భవనం కంటే రోడ్డు 3 పీట్ల ఎత్తుకు చేరింది. దాంతో ప్రతి ఏటా వర్షాలు కురిసినప్పుడల్లా బ్రిడ్జి రోడ్డుపై నుంచి వరద నీరు ఆసుపత్రి భవనాన్ని ముంచెత్తేది. ఆస్పత్రి ప్రాంగణం, గదుల్లోకి మోకాళ్ల లోతున నీరు నిలిచింది. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడేవారు. అంతే కాకుండా పీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరగడంతో అందుకు అవసరమైన విధంగా భవనం విస్తారంగా లేక సేవల పరంగా సిబ్బందికి వసతుల పరంగా రోగులకు సమస్యలు తలెత్తేవి. ఆసుపత్రి సామర్థ్యం ఐదు పడకలకే పరిమితమైనప్పటికీ రోగుల అవసరాల దృష్ట్యా వైద్య సిబ్బంది అదనంగా బెడ్లు ఏర్పాటు చేసిన దాఖలాలు ఉన్నాయి. అనుభవజ్ఞులైన గైనకాలజిస్టు సిబ్బంది ఉండడంతో రోగుల సంఖ్య పెరిగింది.



ఇరుకు, పాత భవనంలో కొనసాగుతున్న బీబీనగర్ పీహెచ్‌సీ

ప్రసవాలు పెరిగాయి. ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకునేందుకు మహిళలు ఎక్కువగా వచ్చేవారు. ఒకేసారి ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మహిళలు వచ్చినప్పుడు పడకలు సరిపోకపోగా వారి వెంట వచ్చిన సహాయకులకు వసతి సదుపాయాలు దొరకక అనేక రకాలుగా ఇబ్బంది పడేవారు.

పీహెచ్‌సీ కొత్త భవనం పూర్తయ్యి ఏడాది

సుమారు 4దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనం ఇరుకుగా ఉండి వైద్య సేవలకు అనుకూలంగా లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి ఆధునిక హంగులతో విశాలమైన భవనాన్ని నిర్మించాలని వైద్య సిబ్బంది స్థానిక నేతల ఒత్తిడి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నాటి మంత్రి హరీష్‌రావు ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కా భవనం నిర్మాణం కొరకు 15వ ఆర్థిక సంఘం నిదులు రూ.1.56కోట్లు మంజూరు చేయించారు. దాంతో మార్చి 27 2023న ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడానికి ముందే ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తయింది. ప్రభుత్వం మారిన తర్వాత అరకొరగా మిగిలిన అసంపూర్తి పనులను ఈ ప్రభుత్వం హయాంలో పూర్తి కాగా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడమే మిగిలింది. కాగా ఏడాది గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. ఇప్పటికైనా పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనాన్ని వినియోగంలోకి తెస్తాం



మండల కేంద్రంలో నిర్మించిన పీహెచ్‌సీ నూతన భవనాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకువస్తాం. ఈ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల కలెక్టర్ బీబీనగర్ పర్యటనకు వచ్చిన సందర్భంగా చెప్పారు. వైద్య సేవలకు అవసరమైన పరికరాల కోసం జిల్లా వైద్యాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. పరికరాలు సమకూరగానే నూతన భవనంలో వైద్య సేవలను ప్రారంభిస్తాం.

-డాక్టర్ మౌనికారెడ్డి, మండల వైద్యాధికారి, బీబీనగర్

స్వర్ణగిరిలో సామూహిక షష్టిపూర్తి వేడుకలు



స్వర్ణగిరిలో షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్న జంటలు



స్వామికి మంగళహారతి నివేదిస్తున్న అర్చకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా స్వర్ణగిరిలో శుక్రవారం ఆలయ కమిటీ, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక షష్టిపూర్తి వేడుకలు నిర్వహించారు. 375 జంటలు వేడుకలలో పాల్గొని సంప్రదాయరీతిలో షష్టిపూర్తిని జరుపుకున్నారు. అలాగే స్వామివారికి నిత్యపూజలు, నిత్యకల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ నిర్వహించారు. దేవతామూర్తులను ఆలయ తిరువీధులలో భక్తుల జయధ్వనుల నడుమ ఊరేగించారు.

మదర్ డెయిరీ డైరెక్టర్ లక్ష్మీ నరసింహారెడ్డికి సన్మానం

మోత్కూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన మదర్ డెయిరీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా గెలుపొందిన మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి శుక్రవారం పాటిమట్ల పాల ఉత్తత్పిదారుల సహకార సంఘానికి వచ్చారు. ఈ సందర్భంగా పాల సంఘం డైరెక్టర్లు ఆయనను శాలువాతో సన్మానించారు. డైరక్టర్ లక్ష్మీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం తాను కృషి చేస్తానని, మదర్ డెయిరీ అభివృద్ధికి తోడ్పడతానన్నారు. కార్యక్రమంలో పాల సంఘం డైరకర్ బండా విజయ్‌రెడ్డి, నర్సిరెడ్డి, రఘుపతిరెడ్డి, మోతె రాధాకిషన్‌రెడ్డి, బండా వెంకట్‌రెడ్డి, చింత సోమక్క, గంగమ్మ, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నరసింహ

భువనగిరి గంజ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టంతో పేదలు, ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములకు ఇంతవరకు పట్టాలు అందలేదని, వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు ప్రభుత్వాలు భూ పంపిణీపై నిషేధం పెడితే తాము అధికారంలోకి వస్తే వెంటనే భూ పంపిణీపై నిషేధం ఎత్తివేస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంతో పేదలకు ఒరిగింది ఏమీ లేదని ఎద్దేవాచేశారు. సమావేశంలో నాయకులు గంగదేవి సైదులు, రాజకొండ రాములమ్మ, పల్లెర్ల అంజయ్య, సురుపంగ స్వామి, గుంటోజి శ్రీనివాస్‌చారి, సిలువేరు ఏల్లయ్య, దొడ్డి బిక్షపతి, కొండపురం యాదగిరి, మానే సాలయ్య, గాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆలేరు, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందనపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ కోటగిరి పాండరి సతీమణి లక్ష్మి అనారోగ్యంతో మరణించడంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ శుక్రవారం పాండరి కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మి మృతి పట్ల ఆయన విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గురై మరణించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఐలి వినోద్ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను బిక్షమయ్య గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట బిఆర్ఎస్ అధ్యక్షులు పుట్ట మల్లేష్, మహేందర్, కార్యదర్శులు రామనర్సయ్య, సింగిల్ విండో ఛైర్మన్ మొగులగాని మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ జంపాల సత్యానారాయణ, నాయకులు కొరుకుప్పల కృష్ణయ్య, ఐల కృష్ణ ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



వలిగొండలో కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆలేరు/ ఆలేరు రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే కార్మిక సంఘం సీఐటీయూ ఒక్కటేనని ఆ సంఘం జిల్లా నాయకుడు మొరిగాడి రమేష్ అన్నారు. నవంబర్ 8వ తేదీన రామన్నపేటలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభల కరపత్రాన్ని శుక్రవారం ఆలేరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు దూడల శ్రీధర్, కె. కృష్ణ, వీరేశం, రాజేష్, రవి, బాబు, వెంకటేష్, బాల్‌రాజు, వీరమల్లు, రాజు, పలువురు పాల్గొన్నారు.

నేడు వలిగొండలో సీఐటీయూ మండల మహాసభ

వలిగొండ : వలిగొండలో శనివారం నిర్వహించనున్న సీఐటీయూ మండల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో నాయకులు ఎల్ల స్వామి, మల్లేషం, వెంకటేషం, నర్సింహ్మా, యల్లమయ్య, రాములు, జంగయ్య, అంజయ్య, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని జంపల్లి, బీబీనగర్, లక్ష్మీదేవి గూడెం, ఎర్రబెల్లు తండా తదితర గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి అండగా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో డీపీఎం రవీందర్, ఏపీఎం మీనా, సీసీలు శ్రీలత, పరుశురాం, నర్మద పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

- ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్/మోటకొండూరు, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారుల చేతుల్లో మోసపోవద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి, మాసాయిపేట, సైదాపురం, మల్లాపురం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకరాగానే తేమశాతం గుర్తించి వెంటనే తూకంవేసి లారీలలో లోడ్‌చేసి మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం తూకం వేసిన మిల్లుకు తరలించిన వారంలోపు బిల్లులు రైతుల ఖాతాలలో జమఅవుతాయని, డబ్బుల కోసం ఇబ్బందులు పడవద్దని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ విప్ తన ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. కుంభర్ణుడు ఆరు నెలలు తిని ఆరునెలలు పడుకున్నట్లుగా కేసీఆర్ రాజకీయం ఉందని అన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీ యాదవ కులానికి చెందిన బిడ్డను రౌడీషీటర్ అని కేసీఆర్ అనడం బాధాకరమని అన్నారు. బడుగు బలహీన వర్గాలను కించేపర్చే విధంగా మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధిచెపుతారని అన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటి చైర్ పర్సన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, నాయకులు బీర్ల శంకర్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్ పాల్గొన్నారు.



మోటకొండూరు: చాడ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై నూతన వస్త్రాలు, పొట్టేలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

మోటకొండూరు : మండలంలోని కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం చాడ గ్రామానికి చెందిన కొత్తోజు వనజ, రవికి చెందిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి యాజమనులకు పట్టు వస్త్రాలు, యాట పొట్టేలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీవో ఇందిర, ఏవో రమాదేవి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, చాడ శశిదర్‌రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, ఏపీఎం ఆనంద్, ఆకుల శ్రీనివాస్, కొంతం మోహన్‌రెడ్డి, బెజ్జంకి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ప్రారంభించారు. పల్లెపహాడ్, మొరిపిరాల, కొరటికల్, సర్వేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డీపీఎం బాలరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో రాములు నాయక్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, సింగిల్‌విడో చైర్మన్ జయశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మరెడ్డి, మాజీ సర్పంచ్ జే.నగేష్, ఏపీఎం నర్సింహ, సీసీలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు అండ

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలకు రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్టు సభ్యులు జీన్రు అంజిరెడ్డి, ఎంఏ. ఖయ్యూం, నర్సింహులు అన్నారు. శుక్రవారం రాజీవ్ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పలు కుటుంబాలకు రూ.60వేల ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిక్క నర్సింహ, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, నర్సింహ, టీమిడి ప్రదీప్, నర్సింహ, ఆనంద్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వలిగొండ, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన రాచమల్ల సత్తయ్య, దేవరాయ సుజాత, బోదాసు నర్సింహ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులకు పైళ రమణమ్మ, సత్యనారాయణరెడ్డి ఫౌండేషన్ ద్వారా వెంకట్‌రెడ్డి శాలిని దంపతుల సహకారంతో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బీఆర్ఎస్ కారణంగానే ఆర్థిక వెనుకబాటు



భూదాన్‌పోచంపల్లి: కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వెనుకబాటుకు బీఆర్ఎస్ పాలకులే కారణమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదికలో 58 కల్యాణ లక్ష్మి, ఒక షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు చేసిన అప్పులకు ప్రతీ నెల సుమారుగా రూ.6వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఏ పేదవానికీ రేషన్‌కార్డు ఇవ్వలేదని, ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సంక్షేమ అభివృద్ధి పథకాలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రూ.13వేల కోట్లతో పేదలకు సన్నబియ్యంపంపిణీ చేస్తున్నామని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. సాగునీటి కాల్వలైన బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వకు రూ. 500కోట్లతో ఆధునీకరణకు తమ ప్రభుత్వం ముందుకొస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నాడని స్పష్టం చేశారు.

- సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని నెమలికాల్వ గ్రామ సమీపంలోని వెంకటేశ్వర, శ్రీసాయి జిన్నింగ్ మిల్లులో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం గరిష్టంగా మద్దతు దర రూ. 8110, కనిష్టంగా రూ.7710 నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బీమ నాయక్, వైస్ ఛైర్మన్ మల్లారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రమణారెడ్డి, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహశీల్దార్ దశరథ, ఎంపిడివో జలేందర్‌రెడ్డి, ఏఓ అంజనిదేవి, మాజీ ఎంపిపిలు నూతి రమేష్‌రాజు, చిట్టెడి జనార్థన్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, సత్తిరెడ్డి, యుగేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలకు చెందిన మొత్తం 47 మందికి రూ.47,05,452 చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, లవకుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ లీలలు ఇన్నిన్ని కాదయా!

(5వ పేజీ తరువాయి)

నిషేధిత జాబితాను నుంచి తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని ఆధారంగా తమ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ గూడెపు రాజమణి పేరుమీద 2019లో కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశాల మేరకు కొలనుపాకలో 24.35ఎకరాలు, ఆలేరులోని 106.21ఎకరాలు మొత్తం 131.16ఎకరాలను 1997-98లో 60మంది దళిత కుటుంబాలకు పంపిణీ చేసినట్టు, రికార్డులు అన్నీ సరిగ్గానే ఉన్నాయని తహసీల్దార్ నివేదించారు. అంతేగాక నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌కు లేఖ నెంబరు బీ/1764/2019 ద్వారా 2019 అక్టోబరులో తహసీల్దార్ లేఖ రాశారు. తహసీల్దార్ నివేదిక ఆధారంగా ఎస్సీ కార్పోరేషన్‌శాఖ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ నిషేధిత జాబితా నుంచి సదరు భూములను తొలగించాలని రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖ రాశారు. అయితే 2008లో గూడెపు రాజమణి మృతిచెందగా, అప్పటి తహసీల్దార్ పి.శ్యాంసుందర్‌రెడ్డి ఎలాంటి విచారణ జరపకుండానే ఎన్వోసీ కోసం అప్పటి కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ కూడా ఆమె పేరున ఎన్వోసీ జారీ చేశారు. మృతిచెందిన వ్యక్తిపై మొత్తం 131.16ఎకరాల భూమికి ఎన్వోసీ ఎలా జారీ చేస్తారని దళితులు ప్రశ్నిస్తున్నారు. అసలు మృతిచెందిన వ్యక్తి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్‌కు ఎలా దరఖాస్తు చేశారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు చేసుకున్న దరఖాస్తులోనూ 49మంది సంతకాలు చేసినట్టు ఉండగా, వాటిలో కొంతమంది సంతకాలు చేయలేదని చెబుతుండటం గమనార్హం. ఈ భూముల విక్రయాలపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'కేఎంగ్రాండ్'లో అన్ని సౌకర్యాలు



కేఎం గ్రాండ్ హోటల్ ప్రారంభోత్సవ పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, హోటల్ యాజమాన్యం


యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన కేఎం గ్రాండ్ హోటల్‌లో అన్ని సౌకర్యాలను కల్పించడం అభినందనీయమని, దీంతో భక్తులకు మరిన్ని సేవలు చేరువయ్యాయని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సుమారు 3ఎకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన కేఎంగ్రాండ్ హోటల్‌ను అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకోసం రుచికరమైన ఆహార పదార్థాలతో పాటు, చక్కని ఏసీ వసతి గదులు, బంక్వేట్ హాల్ నిర్మించారని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలకు అందిస్తున్న కేఎం గ్రాండ్ హోటల్ చైర్మన్ డైరెక్టర్ గడ్డమీది మాధవులుగౌడ్, ఆరె వెంకటేష్‌గౌడ్‌లను అభినందించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, సీఐ బొడ్డుపల్లి భాస్కర్, ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ, నాయకులు గున్న సంజీవరెడ్డి, గుండు ముత్తయ్య, మునిసిపాలిటి మాజీ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, సీస కృష్ణగౌడ్, కలకుంట్ల బాలనర్సయ్యగౌడ్, ముక్కెర్ల కొమురయ్య, నాయకులు, కేఎం గ్రాండ్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలకు సమస్యల సుస్తీ

(5వ పేజీ తరువాయి)

60మంది భువనగిరి కళాశాలలో చేరనున్నారు. దీంతో నర్సింగ్ విద్యార్థుల సంఖ్య 120కి చేరి ఇక్కట్లు మరిన్ని పెరుగుతాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో సమస్యలు తీరుతాయి



కళాశాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు త్వరలో తీరుతాయి. బస్టాండ్ సమీపంలోని ఓ నాలుగు అంతస్తుల అద్దె భవనంలోకి మారుస్తున్నాం. నూతన అద్దె భవనంలో అవసరమైన మరమ్మతు పనులు పూర్తికానున్నాయి. రెండో బ్యాచ్ వచ్చేసరికి అవసరమైన ఫ్యాకల్టీ వస్తుంది. మిగతా సిబ్బందిని కలెక్టర్ నియమించనున్నారు. తరగతులను, ల్యాబ్‌లను హాస్టల్‌ను సక్రమంగానే నిర్వహిస్తున్నాం. త్వరలో శాశ్వత భవనం నిర్మించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

-డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్